భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 27.0

తణుకు : 33.0 - 26.0



తాడేపల్లిగూడెంలో

ఎయిర్‌పోర్టు!

మళ్లీ తెరపైకి ప్రతిపాదన.. కేంద్రంతో చర్చలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి పశ్చిమ గోదావరికి నడిబొడ్డున ఉన్న తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదన మళ్లీ తెరపైకి వచ్చింది. సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే పది విమానాశ్రయాలపై ఆ శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో చర్చించారు. ఇందులో తాడేపల్లిగూడెం ఒకటి. జిల్లాలో విమానాశ్రయం అవసరాన్ని దశాబ్దాల క్రితమే గుర్తించారు. కానీ ఆచరణకు నోచుకోలేదు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాడేపల్లిగూడెం విమానాశ్రయ భూముల్లో 400 ఎకరాలు కేటాయించారు. నిర్మాణం కోసమని ఓ కంపెనీకి బాధ్యతలు అప్పగించారు. సర్వే కూడా చేపట్టారు. తర్వాత ఆ ప్రతిపాదన తెరమరుగైంది. అనంతరం 2014లో తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తాడేపల్లిగూడెంలో విమానాశ్రయాన్ని నిర్మిస్తామంటూ ప్రకటించారు. బ్రిటీష్ కాలంలో తాడేపల్లిగూడెంలో నిర్మించిన ఎయిర్‌స్ట్రిప్ భూములను పరిశీలించారు. పౌర విమానాశాయ శాఖ నుంచి బృందం ఇక్కడ సర్వే నిర్వహించింది. ఆ తర్వాత అదే భూముల్లో నిట్ ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. ఒక వైపు నిట్, మరో వైపు విమానాశ్రయం ఊరిస్తూ వచ్చింది. చివరకు అప్పటి ప్రజా ప్రతినిధులు పైడికొండల మాణిక్యాలరావు, బొలిశెట్టి శ్రీనివాస్ ఏపీ నిట్ వైపే మొగ్గు చూపారు. ఒక దశలో ఏలూరు తరలిపోయిన నిట్‌ను తాడేపల్లిగూడెంలో ఉంచేలా కేంద్ర స్థాయిలో పావులు కదిపారు. చివరకు విమానాశ్రయ భూముల్లో ఏపీ నిట్ ఏర్పడింది.

తాడేపల్లిగూడెం పరిధిలో తాజాగా అటవీ, రెవెన్యూ భూములు అందుబాటులో ఉన్నాయి. అటవీ భూములు కేటాయించాలంటే అటవీ శాఖకు మూడు రెట్లు రెవెన్యూ భూమి ఇవ్వాలి. తెలుగుదేశం గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. తాజాగా విమానాశ్రయం ఏర్పాటు చేయాలంటే వెంకట్రామన్నగూడెం వద్ద అటవీ, రెవెన్యూ భూములు అక్కరకు రానున్నాయి. ఇప్పటికే తాడేపల్లిగూడెం నుంచి వెంకట్రామన్నగూడెం వరకు నాలుగు లైన్‌ల రహదారి విస్తరించింది. భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వరకు జాతీయ రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కేంద్రం భీమవరం-తాడేపల్లిగూడెం రహదారికి జాతీయ హోదానిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వెళ్లాలి. భూసేకరణ నిర్వహించాలి. జాతీయ రహదారిగా విస్తరిస్తే భీమవరం-తాడేపల్లిగూడెం మధ్య రాకపోకలు మరింతగా విస్తరించనున్నాయి. తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పడితే భీమవరం ప్రాంత ప్రజలకు అనువుగా ఉంటుంది.



అందరికీ ఉపయోగం

తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుంది. అటు రావులపాలెం నుంచి ఇటు ఏలూరు దగ్గర వరకు, భీమవరం నుంచి జంగారెడ్డిగూడెం వరకు ఉపయోగకరంగా ఉంటుంది. తాడేపల్లిగూడెం ఉమ్మడి పశ్చిమలోని అన్ని ప్రాంతాల నుంచి జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు విస్తరించాయి. జాతీయస్థాయిలో ఏపీ నిట్, ఉద్యాన విశ్వ విద్యాలయాలకు విమానాశ్రయం అనుకూలం. ఉద్యాన ప్రాజెక్టులకు దీనిని ఒక ప్రామాణికంగా తీసుకుంటారు. ఒక దశలో డైరెక్టరేట్ ఆఫ్ ఫ్లోరీకల్చర్‌ను వెంకట్రామన్నగూడెంలో ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయాలని సంకల్పించారు. అయితే విమానాశ్రయం ఉండాలంటూ కేంద్రం అప్పట్లో స్పష్టం చేసింది. ఇందు కోసం అటు గన్నవరం, ఇటు రాజమండ్రి విమానాశ్రయాలను చూపించారు. చివరి దశలో డైరెక్టరేట్ ఫ్లోరీకల్చర్ మహారాష్ట్రకు తరలిపోయింది. భవిష్యత్తులో ఏపీ నిట్ విస్తరణతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. ప్రముఖులు, విదేశీ విద్యార్థుల రాకపోకలు అధికం కానుంది. వీరందరికీ తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం అనువుగా ఉంటుంది.

పల్లెల్లోనూ అన్న క్యాంటీన్లు

- గ్రామీణ ప్రాంతాలకు విస్తరణ.. జిల్లాలో తొమ్మిదిచోట్ల గుర్తింపు
- స్థలాల ఎంపికకు ప్రభుత్వం ఆదేశం

భీమవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లు అన్నార్తుల ఆకలి తీరుస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లాల్లో భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లో ఏర్పాటు చేసిన వీటి ద్వారా రోజుకు ఐదు వేల మంది కడుపు నింపుకుంటున్నారు. తాజాగా పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు వీటిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థలాలను ఎంపిక చేయాలంటూ ఆదేశాలు జారీచేస్తూ ప్రజారోగ్య శాఖకు బాధ్యతలు అప్పగించింది. వాస్తవానికి 2019లోనే నాటి టీడీపీ ప్రభుత్వం దిశా నిర్దేశం చేసింది. స్థలాలు గుర్తించేందుకు చర్యలు తీసుకుంది. ఇంతలోనే ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్‌లు మూతపడ్డాయి. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిని పునరుద్ధరించారు. మొదటి విడతలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు క్యాంటీన్‌లు ప్రారంభం కాగా, రెండో విడతలో నర్సాపురంలో ప్రారంభం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించే దిశగా 2019లో ప్రతిపాదించిన చోటే మళ్లీ స్థలాలు గుర్తించాలని ఆదేశించింది. ఈ మేరకు కొత్త ప్రతిపాదనలు పంపాలని సూచించింది. ప్రతి నియోజకవర్గంలోనూ గుర్తించిన మేజర్ పంచాయతీల్లో ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో వీరవాసరం, ఉండి, ఆకివీడు, పెనుగొండ, ఆచంట, మొగల్తూరు, అత్తిలి, వేల్పూరు, పెంటపాడులో క్యాంటీన్‌లకు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. స్థలాలు పరిశీలించి ప్రతిపాదనలు పంపి దిశగా ప్రజారోగ్య శాఖ చర్యలు తీసుకుంటోంది.




నేడు సర్‌ప్లస్ టీచర్లకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్ ?

ఏలూరు అర్బన్, ఆగస్టు 18 : పలు అభ్యంతరాలు, సవరణలతో వాయిదా పడుతూ వస్తున్న సర్‌ప్లస్ టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్‌ను సోమవారం చేపట్టేందుకు విద్యాశాఖ మరోసారి సమాయత్తమవుతోంది. ఈ మేరకు ఆదివారం ఉన్నతాధికారుల నుంచి వర్తమానం అందడంతోపాటు, ఫైనల్ సీనియార్టీ జాబితాలను ఏ సమయంలోనైనా విద్యాశాఖకు పంపిస్తారని సమాచారం. ఈ జాబితాల ప్రకారమే సోమవారం సాయంత్రం ఐదు గంటల తర్వాత మండలాల్లో కౌన్సెలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. ఇప్పటికీ క్షేత్రస్థాయిలో పలు అభ్యంతరాలు అపరిష్కృతంగానే వున్నట్టు సమాచారం. ఉర్దూ విద్యార్థులున్న పాఠశాలల్లో సర్‌ప్లస్ సమస్య తలెత్తితే అక్కడ తెలుగు ఎస్జీటీ పోస్టును మిగులు టీచరుగా చూపించడంపై అభ్యంతరాలు తలెత్తుతున్నాయి. వాస్తవానికి స్కూలులో ఇద్దరు, ముగ్గురు ఉర్దూ పిల్లలున్నా అక్కడ విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఉర్దూ టీచరు పోస్టును కొనసాగించాలి. అదే సమయంలో అక్కడి స్కూలులో తెలుగు, ఉర్దూ ఎస్జీటీ పోస్టులుండి, సర్‌ప్లస్ సమస్య తలెత్తిన సందర్భాల్లో నిబంధనల ప్రకారం ఉర్దూ పోస్టును మిగులు జాబితాలో చేర్చేందుకు సాంకేతికంగా అవకాశం లేకపోవడంతో అక్కడ తెలుగు ఎస్జీటీ పోస్టును సర్‌ప్లస్‌గా చూపించడంవల్ల సంబంధిత ఉపాధ్యాయునికి స్థానభ్రంశంతో నష్టపోయే పరిస్థితులున్నట్టు చెబుతున్నారు. జిల్లాలో ప్రతీ మండలంలో కనీసం రెండు లేదా మూడు ఎస్జీటీ పోస్టులకు ఈ తరహా సమస్య ఏర్పడినట్టు సమాచారం. ఇక ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నిష్పత్తి విషయంలో ప్రభుత్వం కొంత వెసులుబాటు, సడలింపులు ఇవ్వడంతో జిల్లాలో ఇప్పుడున్న సర్‌ప్లస్ టీచర్ల సంఖ్య కొంతమేర తగ్గుతుందని భావిస్తున్నారు. దీనిపై అధికారికంగా ఫైనల్ సీనియార్టీ జాబితాలు వస్తేగాని స్పష్టత వచ్చే అవకాశాలు లేవు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

చింతలపూడి, ఆగస్టు 18 : స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల బయాలాజికల్ సైన్స్ టీచర్ వి.సంపత్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్టు డీఈవో అబ్రహం తెలిపారు. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్టు ఫిర్యాదు అందడంతో ప్రాథమిక విచారణ జరిపి సస్పెండ్ చేశామని, పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్టు ఆయన తెలిపారు.

నేత్రపర్వం.. పవిత్రాధివాసం



ద్వారకాతిరుమల, ఆగస్టు 18: చిన తిరుమలేశుని దివ్య పవిత్రోత్సవాల్లో ఆదివారం ఆలయంలో జరిగిన పవిత్రాధివాసం భక్తులకు నేత్రపర్వమైంది. ఉదయం ఆలయంలో విష్వక్సేనపూజ, పుణ్యాహవాచన, అగ్ని ప్రతిష్ఠాపన, పవిత్రాలకు పంచగవ్య ప్రోక్షణ, అభిమంత్రణ, ఉత్సవమూర్తుల వద్ద పవిత్రాలను ఉంచి పంచశయనాది వాసాన్ని వేదమంత్రోచ్ఛరణలతో అర్చకులు, రుత్వికులు వైభవోపేతంగా జరిపారు. మహాశాంతి హోమాలు జరిగాయి. ఆలయంలో చతుర్వేద పారాయణలను నిర్వహించారు.



హైవేలకు మహర్దశ

నరసాపురం-మచిలీపట్నం జాతీయ రహదారి

- దిగమర్రు-ఆకివీడు 165 రహదారికి రూ.1,200 కోట్ల కేటాయింపు
- రెండు నెలల్లో 216 రహదారి పెండింగ్ పనులు పూర్తి

నరసాపురం, ఆగస్టు 18: జిల్లాలోని రెండు జాతీయ రహదార్లకు మహర్దశ పట్టనుంది. ఇప్పటికే 90 శాతం పూర్తయి పెండింగ్‌లో వున్న 216 జాతీయ రహదారి పనులను మరో రెండు నెలల్లో పూర్తి చేయాలని ఎన్‌హెచ్ అధికారులు ఆదేశించారు. దిగమర్రు నుంచి ఆకివీడు వరకు ప్రతిపాదించిన ఫోర్‌లైన్ 165 కొత్త రహదారికి ఈ బడ్జెట్‌లో రూ.1,200 కోట్లు కేటాయించారు. ఇప్పటికే ఆకివీడు నుంచి పామర్రు వరకు చేపట్టిన పనులు 50 శాతం పనులు పూర్తయ్యాయి. కోర్టు పెండింగ్ కేసుల వల్ల దిగమర్రు నుంచి ఆకివీడు వరకు చేపట్టాల్సిన 40 కిలోమీటర్ల పనులు మూడేళ్లుగా ముందుకు సాగలేదు. ప్రస్తుతం న్యాయపరమైన చిక్కులు క్లియర్ కావడం, పెద్ద మొత్తంలో నిధులు కేటాయింపు జరగడంతో పనులు జోరందుకోనున్నాయి.

165 జాతీయ రహదారి సాగేదిలా..

పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు కేంద్రం జిల్లాలో కొత్తగా మరో జాతీయ రహదారిని ప్రతిపాదించింది. విజయవాడ కలిసే విధంగా రూపొందిన ఈ రహదారికి 165 జాతీయ రహదారిగా నామకరణం చేశారు. పాలకొల్లు మండలం దిగమర్రు నుంచి కృష్ణా జిల్లా పామర్రు వరకు 114 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ రహదారిని రెండు ప్యాకేజీలుగా విభజించారు. ఆకివీడు నుంచి పామర్రు వరకు 70 కిలోమీటర్లు మొదటి ప్యాకేజీగా, దిగమర్రు నుంచి ఆకివీడు వరకు 40 కిలోమీటర్ల రెండో ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలిచారు. మొదటి ప్యాకేజీ పనులు రెండేళ్ల క్రితమే ప్రారంభమయ్యాయి. దిగమర్రు నుంచి ఆకివీడు వరకు చేపట్టే భూసేకరణ పనులకు న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తాయి. కొందరు రైతులు కోర్టుకు వెళ్లడంతో మూడేళ్ళ నుంచి ముందుకు సాగలేదు. ఇటీవల ఇవన్నీ క్లియర్ అయ్యాయి. దీంతో కేంద్రం ఈ పనుల వేగవంతానికి రూ.1,200 కోట్లు కేటాయించింది. భూసేకరణతోపాటు రోడ్డు నిర్మాణ పనులకు ఈ నిధులు వెచ్చించనున్నారు. ఇప్పటికే మొదటిఫేజ్ పనులు జోరందుకోవడంతో అదే స్పీడ్‌లో రెండో ఫేజ్ పనుల్ని పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఎన్‌హెచ్ అధికారులు ఉన్నారు. ఈ రహదారి పాలకొల్లు పట్టణం మీదుగా వెళ్ళదు. దిగమర్రు నుంచి బల్లిపాడు, వీరవాసరం, భీమవరం మీదుగా ఆకివీడు వెళుతుంది.

చించినాడ-లోసరి పెండింగ్ పనులు పూర్తి

జిల్లాలో 216 జాతీయ రహదారి పనులు సుమారు 50 కిలోమీటర్ల మేర చేపట్టారు. కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు వెళ్లే జాతీయ రహదారి జిల్లాలో చించినాడ వద్ద కలుస్తోంది. 2015లో ప్రారంభించిన ఈ పనులు ఆది నుంచి మందకొడిగానే సాగుతున్నాయి. ప్రస్తుతం ఈ రహదారిపై ట్రాఫిక్‌ను విడిచిపెట్టినా.. పెండింగ్ పనులు పూర్తికాలేదు. చాలాచోట్ల కల్వర్టు, అప్రోచ్ రహదారులు, లైటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటిని పూర్తి చేయాలని ఇటీవల ఎన్‌హెచ్ అధికారులు ఆదేశించారు. మచిలీపట్నం ప్రాజెక్టు అధికారి పరివేక్షణలో సాగే ఈ పనులను వేగవంతం చేయాలని నిర్ణయించారు. దీంతో రెండు రోజుల నుంచి పెండింగ్ పనులు మొదలుపెట్టారు. అక్టోబర్ నాటికి ఈ పనులను పూర్తి చేయనున్నారు. నరసాపురం పట్టణం పరిధిలోనే చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి పూర్తయితే 216 జాతీయ రహదారికి కొత్త కళ రానుంది.



వణుకుతున్న పశ్చిమ

హై ఫీవర్

- జ్వరాలు, దగ్గు, ఒళ్లు నొప్పులతో పడకేస్తున్న జనం.. ఆసుపత్రులకు క్యూ.. పరీక్షలకు వేలల్లో ఖర్చు
- గ్రామీణ ప్రాంతాల్లో లోపించిన పారిశుధ్యం.. మరోవైపు ఎండ తీవ్రత, ఉక్కబోతతో విలవిల

మొన్నటి వరకు కురిసిన వర్షాలు.. ఇప్పుడు వేసవిని తలపించే ఎండలు, ఉక్కపోతతో జనం విలవిల్లాడుతున్నారు. వాతావరణ మార్పులు, పారిశుధ్యలోపం, దోమల విజృంభణతో జిల్లాకు జ్వరమొచ్చింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు జ్వరాలు, తలనొప్పి, ఒంటి నొప్పులు, జలుబు, దగ్గులతో బాధపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే వ్యాధిగ్రస్తుల్లో వైరల్ ఫీవర్ కేసులే 40 శాతం వరకు ఉంటున్నాయి. రోజూ పదుల సంఖ్యలో జ్వర పీడితులు గ్రామీణ వైద్యులతో చికిత్స చేయించుకుంటున్నారు.

భీమవరం టౌన్/పెనుమంట్ర/అత్తిలి/కాళ్ల/ఇరగవరం, ఆగస్టు 18 : పది రోజుల క్రితం ఏకధాటిగా కురిసిన వర్షాలు వణికిస్తే.. ఇప్పుడు వేసవిని తలపించే ఎండలు.. పగలు, రాత్రి తేడా లేకుండా ఉక్కపోత చెమటలు పట్టిస్తున్నాయి. జిల్లాలోని పెనుమంట్ర మండలం ఆలమూరు, ఆకివీడు మండలం దుంపగడపతోపాటు తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, నరసాపురం, పెంటపాడు, కాళ్ల, ఇరగవరం తదితర ప్రాంతాల్లోని ప్రజలు వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలు తగ్గిన తర్వాత కొందరికి కాళ్లు, నడుంనొప్పి, నీరసం, నడవలేని పరిస్థితి ఏర్పడుతున్నట్టు బాధితులు చెబుతున్నారు. జ్వర పీడితులతో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురంలోని ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఓపీ పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని జ్వరపీడితులంతా ఆరోగ్య కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. అధిక జ్వరం రావడంతో బాధితులు ప్రైవేట్ హాస్పటల్స్‌ను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం సక్రమంగా లేకపోవడం, మురుగునీరు నిల్వ ఉండటం, నీరు కలుషితం కావడంతో జ్వరాలు విజృంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు.

పారిశుధ్య లోపమే కారణం

ప్రజలు జ్వరాల బారిన పడడానికి పారిశుధ్య లోపమే కారణమని వైద్యులు చెబుతున్నారు. డ్రైనేజీల్లో నీరు పారక, మురుగు బయటకు వెళ్లే మార్గం లేక ఇళ్ల మధ్యలో ఉండి అవి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పెనుమంట్ర మండలం ఆలమూరులో 15 రోజుల నుంచి జ్వరాలతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 34 మంది టైఫాయిడ్ ఫీవర్ బాధితులు ఉన్నారు. ఇద్దరికి డెంగీ పాజిటివ్ రావడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తెల్ల రక్త కణాలు తగ్గిపోవడంతో 50 మంది ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స పొంతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆలమూరు పీహెచ్‌సీలోనూ, హెల్త్ క్లినిక్‌లోను వైద్య సేవలందిస్తుండగా ప్రతిరోజు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో జ్వరాల పీడితులు 80 మంది వైద్యానికి వస్తున్నారని చెబుతున్నారు. అత్తిలి మండలంలో రెండు పీహెచ్‌సీలకు అధిక సంఖ్యలో జ్వరపీడితులే రావడం గమనార్హం. టైఫాయిడ్ కేసులు ఎక్కువగా ఉన్నాయి. ఇరగవరం మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా జ్వర పీడితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. దీంతో ఆర్‌ఎంపీల వద్దకు క్యూ కడుతున్నారు. రకరకాల పరీక్షల పేర్లతో పేదల జేబులు ఖాళీ అవుతున్నాయి. ప్రభుత్వాసుపత్రి సిబ్బంది వర్షాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్యాంపులు చేపట్టడం లేదు. గ్రామాల్లో వైద్య శిబిరాలు కరువయ్యాయి. శానిటేషన్ అధ్వాన్నంగా మారడంతో దోమలు పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. కాళ్ల మండలం కాళ్ళ, కోలనపల్లి, దొడ్డనపూడి, కోపల్లె తదితర గ్రామాల్లో వైరల్, టైఫాయిడ్, మలేరియా జ్వరాల తీవ్రత అధికంగా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రిలో రోజుకు 100 మంది వైద్యం నిమిత్తం వస్తూంటే వీటిలో అధిక శాతం జ్వరాలతో బాధపడే వారే అధికంగా ఉంటున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సునీల్ తెలిపారు. గ్రామాల్లో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు కాచి చల్లార్చిన నీరు తాగడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునని చెప్పారు.



కాళ్లలో వైద్య పరీక్షలు

• పదుల సంఖ్యలో కేసులు

పీహెచ్‌సీలో జ్వరాలపై కేసులు నమోదవుతున్నట్టు వైద్యాధికారులు చెబుతున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రతీరోజు జ్వరాలపై సర్వే జరుగుతోంది. జ్వరాల సంఖ్య పెరిగినట్లుగా గుర్తిస్తే వెంటనే అక్కడ వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడు ప్రాంతాల్లో 20 నుంచి 40 వరకు కేసులు ఉంటున్నాయని చెబుతున్నారు. ఆకివీడు మండలం దుంపగడపలో జ్వరాలు తగ్గిన తరువాత నీరసం, కీళ్ళ నొప్పులు, నడుం నొప్పి ఉంటున్నాయని చెబుతున్నారు. ఆలమూరులోను జ్వరాలు తగ్గుముఖం పట్టాయి. పెనుమంట్ర, అత్తిలి మండలాల్లో విష జ్వరాలు ఆగటం లేదు. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కొందరికి తెల్ల రక్త కణాలు తగ్గిపోతుండడంతో పట్టణాలకు వెళ్లి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు వల్ల వాతావరణంలో మార్పులు, పారిశుధ్య లోపం, కలుషిత నీటి కారణంగా వైరల్ ఫీవర్లు వస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. స్వల్పంగా దగ్గు, జలుబు వున్నా అది వైరల్ ఇన్‌ఫెక్షన్‌కు దారి తీసే ప్రమాదం ఉంది. జ్వరం కారణంగా కండరాల నొప్పులు వస్తున్నాయి. ఈ క్రమంలో వైరల్ జ్వరాలు రాకుండా మాస్కులు ధరించాలి.



దోమలకు ఆవాసాలు ఇవే.. ఇళ్ళ చుట్టూ నిల్వ ఉన్న నీరు

డెంగీ కేసులు నమోదు కాలేదు : డీఎంహెచ్‌వో

జిల్లాలో ఎక్కడా డెంగీ కేసులు నమోదు కాలేదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. 'డెంగ్యూ లక్షణాలతో ఎవరైనా ప్రైవేట్ హాస్పటల్స్‌కు రోగులు వస్తే.. వారి పరీక్ష కోసం శాంపిల్స్‌ను తణుకు ప్రభుత్వాసుపత్రికి పంపించాలని ఆదేశాలు ఇచ్చాం. జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉన్నాం. ప్రతీరోజు సమాచారం సేకరిస్తున్నాం. జిల్లాలో ఎక్కడా మందుల కొరత లేదని చెప్పారు.

సన్..డే

- మండుతున్న ఎండలు.. ఉక్కపోతతో జనం విలవిల



నరసాపురం టౌన్/ఆచంట/పెనుగొండ, ఆగస్టు 18 : వారం రోజులుగా కాస్తున్న ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. నరసాపురంలో ఉదయం 11 గంటలు దాటితే బయటకు రావడానికి జనం బెంబేలెత్తిపోతున్నారు. రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఏసీలు నిరంతరం తిరుగుతున్నాయి. ఆగస్టు నెలలో గతంలో ఎన్నడూ ఈ తరహా ఎండలను చూడలేదని ప్రజలు వాపోతున్నారు. ఆదివారం భీమవరంలో 36 డిగ్రీలు, నరసాపురం, తాడేపల్లిగూడెంలలో 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తీరంలో వీస్తున్న సముద్ర గాలులకు ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేసింది. శరీరమంతా జిడ్డు బారుతోంది. మరో వారం రోజులపాటు ఇదే విధంగా ఎండలు కాస్తే మరింత మంది అనారోగ్యం బారిన పడడం ఖాయం. పెనుగొండ, ఆచంట ప్రాంతాల్లో ఆదివారం భిన్న వాతావరణం చోటు చేసుకుంది. ఒకచోట వాన కురిసి, మరోచోట ఎండ కాయడంతో జనం ఇబ్బందులు పడ్డారు. వర్షం పడినప్పటికి వేడి మాత్రం లేదు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వాతావరణం మబ్బులతో ఏర్పడినప్పటికి ఉక్కబోత తగ్గలేదు.



ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మబ్బులతో ఆకాశం

సోదర ప్రేమకు ప్రతీక

నేడు రక్షాబంధన్

ద్వారకాతిరుమల/ఏలూరు కార్పొరేషన్/పాలకొల్లు అర్బన్/ ఆగస్టు 18 : శ్రావణ శుద్ధ పౌర్ణమి రోజున రాఖీ పండగతోపాటు జంధ్యాల పౌర్ణమిని కూడా జరుపుకుంటారు. రాఖీ పండుగ నాడు సోదరుడు ఎంత దూరాన ఉన్నా సోదరి వద్దకు వెళ్ళి రాఖీ కట్టించుకుని, పసుపు, కుంకుమలు అందజేస్తారు. తద్వారా సోదరుడికి ఏడాదంతా మంచి జరుగుతుందనే నమ్మకం. రాఖీ కట్టడం వల్ల తమ సోదరుడు తమకు ఎప్పుడూ అండగా ఉంటారని నమ్ముతారు. సోదరులు తమ సోదరీమణులకు అండగా ఉంటామని వాగ్దానం చేస్తారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో రాఖీలు పెద్ద ఎత్తున విక్రయాలు జరుగుతున్నాయి. వెండి రాఖీలు ఒక్కొక్కటి రూ. 250, రూ.300 వరకూ ఉండగా వివిధ రకాల రాఖీలు రూ.10 నుంచి రూ.100 వరకూ మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, జంగారెడ్డిగూడెం మార్కెట్‌లలో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.





మార్కెట్‌లో విక్రయిస్తున్న వివిధ రకాల రాఖీలు

రాఖీ ఎప్పుడు కట్టాలి



శాస్త్రాల ప్రకారం భద్రకాలంలో రాఖీ కట్టకూడదని పండితులు చెబుతున్నారు. భద్రకాలం ముగిసిని తర్వాతే రాఖీ కట్టాలి. జ్యోతిష్యం ప్రకారం రాఖీ పౌర్ణమి వేళ మూడు శుభయోగాలు ఏర్పడనున్నాయి. సర్వార్ధ సిద్ధి యోగం, శోభన్‌యోగం, రవియోగం వంటివి ఏర్పడతాయని వారు చెబుతున్నారు. ఈ ఏడాది సోమవారం ఉదయం శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిది తెల్లవారుజామున 3.04 గంటలకు ప్రారంభమవుతుంది. ఆదే రోజు రాత్రి 11-55 కు ముగుస్తుంది. ఈ నేపథ్యంలో పంచాంగం ప్రకారం భద్రకాలం ఉదయం 5.53 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1.32 వరకూ ఉంటుంది. భద్రకాలం ముగిసిన తర్వాత సోదరీమణులు రక్షాసూత్రాన్ని తమసోదరుని మణికట్టుపై కట్టోచ్చు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటా 46 నిమిషాల నుంచి రాత్రి 10 వరకూ శుభసమయం ఉందని పండితులు చెబుతున్నారు.

హైదరాబాద్ బస్సులు కిటకిట

» ఆరు స్పెషల్ సర్వీసులు ఏర్పాటు
» నేడు కూడా కొనసాగనున్న రద్దీ



భీమవరం టౌన్, ఆగస్టు 18 : వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడంతో హైదారాబాద్ నుంచి స్వస్థలాలకు వచ్చిన వారు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరడంతో జిల్లాలోని ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం, వరలక్ష్మి వ్రతం, శనివారం, ఆదివారం వరసగా సెలవులు రావడంతో అనేకమంది హైదరాబాద్ నుంచి సొంత గ్రామాలకు వచ్చారు. దీనికి తోడు శుభకార్యాలు ఈ సెలవులోనే రావడంతో రద్దీ మరింత పెరిగింది. ఆదివారంతో సెలవులు ముగియడంతో తిరిగి హైదరాబాద్‌కు పయనమయ్యారు. దీంతో ఆర్టీసీ హైదరాబాద్‌కు నడిపే 15 సర్వీసులకు రిజర్వేషన్ పూర్తి కావడంతో ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. భీమవరం డిపో నుంచి ఒకటి, నరసాపురం డిపో నుంచి నాలుగు, తాడేపల్లిగూడెం డిపో నుంచి ఒక సర్వీసు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం రద్దీ కొన ఉందని రెగ్యూలర్ సర్వీసులకు రిజర్వేషన్లు పూర్తి అయ్యాయని, రద్దీ ఉంటే డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తారని చెబుతున్నారు.

ప్రైవేట్ బస్సుల దోపిడీ

రద్దీ దృష్ట్యా ప్రైవేట్ యాజమాన్యాలు దోపిడీకి తెరలేపారు. టికెట్టు ధర రూ.రెండు వేలకు పెంచేయడంతో ప్రయాణికులు కంగుతింటున్నారు. సంకాంత్రి సీజన్‌లోనే లేని ధర ఇప్పుడు ఉండడంతో ఆశ్చర్యపోతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో టికెట్టు బుక్ చేసుకుంటున్నారు. కొంత మంది ప్రయాణాన్ని వాయిదా వేసుకుంటున్నారు. వాహనాలపై వచ్చిన వారు కుటుంబ సభ్యులతో కలసి బయలుదేరి వెళ్ళారు.

రైలింగ్ ఊడి.. బీటలు వారి..



ఆలపాడు జువ్వకనుమల డ్రెయిన్‌పై వంతెన ప్రమాదకరం



జువ్వకనుమల డ్రెయిన్‌పై శిథిల వంతెన (ఇన్‌సెట్) వంతెనపై బీటలు

నిత్యం వేలాది మంది ప్రయాణించే మార్గంలో ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో ఆ వంతెనపై ప్రజలు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నా రు. ఈ మార్గం గుండా కొల్లేరు ప్రజలే కాక పెద్దింటి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు నిత్యం వస్తూనే ఉంటారు. కైకలూరు మండలం ఆలపాడులో జువ్వకనుమల డ్రెయిన్‌పై వంతెన అధ్వానంగా ఉంది. వంతెనకు ఇరువైపులా రైలింగ్ దెబ్బతినడమే కాక, గోడలు బీటలు వారి ప్రమాదస్థితికి చేరారు. దశాబ్దాల కాలం నాడు నిర్మించిన వంతెన కావ డం, కనీస మరమ్మతులు కూడా నిర్వహించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. వంతెన వద్ద దట్ట మైన చెట్లు ఏర్పడడం, బీటలు వారడంతో ప్రమాదం పొంచి ఉందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వంతెనకు కనీస మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు. -కైకలూరు

తగ్గిన చికెన్ ధరలు



తణుకు, ఆగస్టు 18 : మార్కెట్లో చికెన్ ధరలు తగ్గుముఖం పట్టాయి. శ్రావణ మాసం ఆరంభం కావడం, వరలక్ష్మి వ్రతం మొదలుకొని మాంసం తినే వారి సంఖ్య తగ్గిపోయింది. దీంతో ఒక్కసారిగా చికెన్ ధరలు తగ్గిపోయాయి. వర్షాకాలం అయినప్పటికి ఎండలు బాగా మండిపోతున్నాయి. ఇది కూడా అమ్మకాలు తగ్గడానికి కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. గత పదిహేను రోజులు నుంచి చికెన్ ధరలు తగ్గాయంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో స్కిన్ లెస్ రూ.200, స్కిన్ రూ.180 వరకు విక్రయిస్తున్నారు. బ్రాయిలర్ పెంపకందార్లు తక్కువగానే ఉంటున్నారు. సరైన ధరలు లేకపోవడం వల్ల చిన్న వ్యాపారులు వద్ద బ్రాయిలర్ కోళ్ళు లేకుండా పోయాయి. ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీలు వద్ద మాత్రమే ఉన్నాయి. అయినప్పటికీ వారు కూడా లాభాలు ఆశించకుండానే వ్యాపారాలు చేస్తున్నారని చెబుతున్నారు. రానున్నవి అన్నీ పండగ రోజులు కావడం వల్ల ధరలు మరింత తగ్గుముఖం పట్టే అవకాశాలు లేకపోలేదు. గత నాలుగు రోజులుగా చికెన్ ధరను స్వల్పంగా పెంచుతున్నారు. కేజీకి రూ.20 వరకు పెరిగినట్లు చెబుతున్నారు. అయినప్పటికి రైతులు వద్ద కోళ్ళు లేకపోవడం, కంపెనీలు కూడా లైవ్ కేజీ రూ.100 నుంచి రూ.105 వరకు అమ్ముతున్నారు. దీంతో కేజీకి రూ.పది పెరిగితే తప్ప గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదని వ్యాపారులు చెబుతున్నారు.

ఫోటోగ్రఫీలో 50 ఏళ్లుగా సేవలు

అత్తిలి, ఆగస్టు 18 : ఫోటోగ్రఫీ రంగంలో 50 సంవత్సరాలుగా అత్తిలికి చెందిన నందం తాతయ్య విశేష సేవలు అందిస్తున్నారు. పాత కాలపు కెమెరాలతో పాటు అత్యాధునిక కెమెరాలను కూడా విని యోగించిన ఘనత తాతయ్యకు దక్కుతుంది. ఒకప్పుడు ఫోటో కావాలంటే తప్పనిసరిగా స్టూడియోకు వెళ్ళి ఫోటో తీయించుకునేవారు. సుదీర్ఘ కాలం ప్రాసెసింగ్ ఐన తర్వాత ఫోటో ఇచ్చేవారు. ఇప్పుడైతే క్షణాలలో ఫోటో చేతిలో పెడుతున్నారు. ఫోటోగ్రఫీలో సాం కేతికత పెరిగిన తర్వాత ఫోటో గ్రాఫర్ల జీవితాల్లో మార్పు వచ్చిం దని తాతయ్య వాపోయారు. అత్యాధునిక కెమెరాలతో పాటు సెల్‌ఫోన్లు వచ్చాక ఫోటోగ్రఫర్లకు ఉపాధి తగ్గిపోయిందన్నారు. తన నైపుణ్యంతో ఎంతో క్లిష్టమైన ఫోటోలు తీసే తాతయ్య ఫోటోగ్రఫీ వృత్తితో తృప్తి పడక సమాజ సేవలో కూడా పాలుపంచుకుంటున్నారు. పిఠాపురంలో గల విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం జిల్లా కన్వీనర్‌గా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెండేళ్లగా కరోనా మహమ్మారి ప్రజలను ఇబ్బందులు పెట్టగా పీఠం తరఫున నిరంతరాయంగా భోజన ప్లేట్లు, కరోనా నివారణ మందులు అందజేశారు. పలువురికి నిత్యావసర సరుకులు తాతయ్య అందించారు.





తాతయ్య తీసిన ఫోటో...



నాటి నుంచి నేటి వరకు తాతయ్య వినియోగించిన కెమెరాలు

కిటకిటలాడిన వెంకన్న క్షేత్రం

ద్వారకాతిరుమల, ఆగస్టు 18: ద్వారకా తిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్త జనులతో కిటకిటలాడింది. సాధారణ సెలవు రోజు కావడంతోపాటు ఈ శ్రావణ మాసంలో ఎక్కువగా వివాహాలు జరిగాయి. దీంతో ఆదివారం ఉదయం నూతన దంపతులు, వారి బంధువులు శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు యాత్రికులతో నిండిపోయాయి. దాదాపు 15 వేల మంది వరకూ యాత్రికులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి.




మెట్ల మార్గంలో భక్తుల రద్దీ

గల్ఫ్‌లో కష్టాలకు విముక్తి.. స్వగ్రామానికి సంకురమ్మ



బుట్టాయగూడెం, ఆగస్టు 18 : ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్ళి అష్టకష్టాలు పడిన తాతి సంకురమ్మ ఎట్టికేలకు కువైట్ నుంచి స్వగ్రామానికి వస్తుంది. బుట్టాయగూడెం మండలం మర్లగూడెంకు చెందిన గిరిజన మహిళ తాతి సంకురమ్మ ఉపాధి కోసం ఏడాది క్రితం కువైట్ వెళ్ళింది. అక్కడున్న వారు తనను అనేక ఇబ్బందులు పెడుతున్నారని, భోజనం కూడా పెట్టడం లేదని, ఆనారోగ్యంగా ఉన్నా పట్టించుకోవడంలేదని ఇక్కడే ఉంటే చనిపోతానని సెల్ఫీ విడియో కాల్ ద్వారా సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దృష్టికి తీసుకువెళ్ళి సహాయం చేయాలని, సంకురమ్మను ఇండియాకు రప్పించాలని కోరడంతో ప్రభుత్వ సాయంతో ఇండియాకు రప్పించే ప్రయత్నాలు చేశారు. దీంతో సంకురమ్మ ఈ నెల 20న కువైట్ నుంచి మర్లగూడెం వస్తున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. తన కోసం అధికారులు, ఏజెంట్లతో మాట్లాడి సురక్షితంగా స్వగ్రామానికి తీసుకురావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే బాలరాజుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసింది..

ఒడిశా సీఎంను కలిసిన ఎమ్మెల్యే బొలిశెట్టి



తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 18: ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మజ్జీని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. భువనేశ్వర్‌లో సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి సీఎంతో భేటీ అయ్యారు. ఆ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ విజయవంతంగా నిర్వహిస్తున్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రతి వ్యక్తికి రూ.10 లక్షల వంతున ఒడిశాలో వైద్య సేవలకు అందిస్తున్నామని, ఇందుకు నిధులు ముందుగానే సమకూరుస్తున్నామని సీఎం వివరించారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, ఆగస్టు 18 : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్లవ్యర్థాలను తరలిస్తుండగా తనిఖీలు నిర్వహించి పెదపాడు వద్ద బోలోరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. వాహన, చెరువు యజమానులు, వాహన డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్ల నిర్మాణం చేపట్టాలని నిరసన

ఇరగవరం, ఆగస్టు 18 : వైసీపీ పాలనలో గ్రామాల్లోన్ని రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయని ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతూ కత్తవపాడు-జుత్తిగ రహదారిలో ఆదివారం ప్రజలు రోడ్డుపై నిరసన తెలిపారు. కత్తవపాడు, పొదలాడ, జుత్తిగ, పెనుమంత్ర అనేక గ్రామాలు ప్రజలు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తారని రైతులు, విద్యార్థులు ప్రతి రోజు ఈ రోడ్డు నుంచి ప్రయాణం సాగిస్తారన్నారు. ఐదేళ్లుగా ఈ రోడ్డు పూర్తిగా పాడైపోయి గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నా తాత్కాలికంగా గుంటలు పూడ్చడమే తప్ప నిర్మాణం చేపట్టలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సంఘాల నాయకులు కామన మునిస్వామి, దంపనబోయిన విజయలక్ష్మి, కొప్పిశెట్టి అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి



వెంకటరమణ మృతదేహం

భీమడోలు, ఆగస్టు 18 : విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన భీమడోలు మండలం సూరప్ప గూడెంలో జరిగింది. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన బోను వెంకట రమణ (52) ఆదివారం ఉదయం డ్రైనేజీ శుభ్రం చేసేందుకు పక్కనే ఉన్న తన తోడల్లుడు డాబాపైకి ఎక్కి ఇనుప ఊచ తీస్తుండగా డాబాపైనే విద్యుత్ తీగలకు ఇనుప ఊచ తగిలి షాక్‌నకు గురయ్యాడు. ఈ ప్రమాదంలో వెంకట రమణ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కుమారుడు అరవింద్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకట రమణ భీమడోలులో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకి భార్యా, పిల్లలు ఉన్నారు.

అపార్ట్‌మెంట్‌లో విద్యుత్‌షాక్.. ఒకరి మృతి

భీమవరం క్రైం, ఆగస్టు 18 : ఒక అపార్ట్‌మెంట్‌లో పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ కరెంటు షాక్ తగిలి చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా ఓ వ్యక్తి మృతి చెందాడు. టూ టౌన్ ఎస్‌ఐ వీర్రాజు తెలిపిన వివరాలు ప్రకారం భీమవరం మండలం ఎల్‌వీఎన్‌పురం గ్రామానికి చెందిన ఉప్పులపాటి సుబ్బారావు (67) ఈ నెల 17న ఏఎస్‌ఆర్ నగర్‌లోని లోటస్ అపార్ట్‌మెంట్‌లో పని నిమిత్తం వచ్చాడు. అయితే అక్కడ ఉన్న బల్బుకు ఉన్న వైరు తగిలి కరెంటు షాక్ తగిలింది. దీంతో అతన్ని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య ఉప్పలపాటి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొగల్తూరులో పేకాట స్థావరంపై దాడి

మొగల్తూరు, ఆగస్టు 18: మొగల్తూరు పంచాయతీ వడయార్‌పేట సమీపంలో ఆదివారం ఒక గృహంలో నిర్వహిస్తున్న స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.5,200లు నగదు స్వాధీనం చేసుకున్నట్టు మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసు తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న ఏడుగురి అరెస్టు

కాళ్ళ, ఆగస్టు 18 : కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు కాళ్ళ ఎస్‌ఐ ఎన్.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. బొండాడ గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద రూ.2,250 నగదు, కోడిపుంజు, కోడికత్తి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



పంటబోదెలోకి దూసుకెళ్ళిన కారు

పెంటపాడు, ఆగస్టు 18 : రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలివి. నిడదవోలుకు చెందిన తల్లి వీర రాఘవతి (77), ఈమె కుమారుడు కోటేశ్వరరావు శనివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి తమ స్వగ్రామం నిడదవోలు కారులో వస్తున్నారు. ప్రత్తిపాడు జాతీయ రహదారిపై వీరు ప్రయాణం చేస్తున్న కారును వెనుక నుంచి మరో కారు ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పి కారు పక్కనే ఉన్న పంట బోదెలోకి దూసుకు వెళ్ళింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన వీరరాఘవతిని 108లో తాడేపల్లిగూడెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండంగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడెం ఏరియా ఆస్పత్రికి తరలించామని, కుమారుడు కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రేమించకపోతే చంపేస్తానని బెదిరింపు

ఏలూరు క్రైం, ఆగస్టు 18 : తనను ప్రేమించకపోతే చంపేస్తానని ఓ విద్యార్థినిని ఓ యువకుడు బెదిరించాడు. వివరాలివి.. ఏలూరు నగరంలోని ఒక ప్రాంతానికి చెందిన విద్యార్థిని(14) పదో తరగతి చదువుతుంది. ఏలూరు శనివా రపుపేటనకు చెందిన లంకపల్లి విష్ణు (20) అనే యువకుడు రోజూ వెంటపడి తనను ప్రేమించాలని వేధిస్తున్నాడు. ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం ఆ విద్యార్థిని ఇంట్లో ఉండగా తనను ప్రేమించాలని లేదం టే చంపివేస్తానని విష్ణు బెదిరించాడు. అదే సమయంలో ఆ విద్యార్థిని అమ్మమ్మ రావడంతో పారిపోయాడు. ఈ విషయం పెద్దలతో చెప్పి మందలించడంతో విష్ణు, అతని స్నేహితులు మరో ఇద్దరు వచ్చి ఆ బాలికను చెంపలపై కొట్టారు. ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఉదయం బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయడంతో సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆ ముగ్గురు యువకుల పై ఈవ్ టీజింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై అత్యాచారయత్నం కేసులో ముగ్గురు యువకుల అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, ఆగస్టు 18 : ఏలూరు వన్ టౌన్ ప్రాంతంలో అర్ధరాత్రివేళ ఒక మహిళపై అత్యా చారయత్నానికి పాల్పడిన కేసులో ముగ్గురు యువకులను అరెస్టు చేశా మని ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ చెప్పారు. ఏలూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లింగపాలెం మండలానికి చెందిన 35 ఏళ్ళ వివాహిత భర్త మరణించడంతో ఆమె పెదవేగి మండలంలోని ఒక గ్రామంలో ఉన్న కోళ్ళ ఫారంలో పనికి వెళ్ళి అక్కడ పరిచయం అయిన వ్యక్తితో సహజీ వనం చేస్తుంది. పది రోజుల క్రితం వారిద్దరూ కలిసి ఏలూరులోని ఒక హోటల్‌లో పని చేయడానికి వచ్చి వన్ టౌన్‌లోని ఒక గుడి ఆవరణలో తల దాచుకున్నారు. ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి సమయంలో ముగ్గురు యువకులు వచ్చి వారు భోజనం చేస్తున్న సమయంలో వారితో మాటలు కలిపి మద్యాన్ని ఆ ముగ్గురు యువకులతోపాటు వీరిద్దరు కూడా తాగారు. అద్దెకు ఇల్లు చూపిస్తామని తమ ప్రాంతాల్లో ఉన్నాయని పేర్లు చెప్పుకుని ఆ తరువాత ఆ మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఆ మహిళను, యువకుడుని కొట్టడంతో వారు కేకలు వేశారు. అటుగా ఒక యువకుడు రావడంతో ఆ ముగ్గురు యువకులు పారిపోయారు. ఈ సమాచారం అందుకున్న 15 నిముషాల్లోనే బీట్ పోలీసులు, నైట్ గస్తీలో ఉన్న ఎస్‌ఐ సాధిక్ వెంటనే బాధితురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకుని వారి ఆసుపత్రికి తరలించా మన్నారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాలతో వన్ టౌన్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారి జాడ తెలుసుకున్నామన్నారు. వారిని గుర్తించి అరెస్టు చేశామన్నారు. కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించామన్నారు. కొన్ని మీడియాల్లో (ఆంధ్రజ్యోతి కాదు) మూకుమ్మడి అత్యాచారమని ప్రచారం చేశారని ఇది వాస్తవం కాదని అత్యాచారయత్నం మాత్రమే జరిగిందని ఏదైనా సమాచారాన్ని పోలీసు అధికారుల నుంచి నిర్ధారణ చేసుకున్న తరువాతే మీడియాలో ప్రచారం చేయాలే తప్ప అనవసరంగా ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్, ఎస్‌ఐలు లక్ష్మణబాబు, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోయిన మహిళ

గంటల వ్యవధిలోనే బ్యాగ్‌ను అప్పగించిన పోలీసులు

ఏలూరు క్రైం, ఆగస్టు 18 : బంధువుల ఇంట్లో జరిగే శారీ ఫంక్షన్ కోసం వచ్చి ఇంటి నుంచి ఫంక్షన్ హాలుకు ఆటోలో నగలు బ్యాగ్‌తో వెళ్ళిన ఆ మహిళ ఫంక్షన్ హాలు వద్ద ఆటోలో బ్యాగ్ మర్చిపోయారు. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఆటో యూనియన్ నాయకుడి సహకారంతోపాటు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఆటోను గుర్తించి వస్తువులను బాధితురాలికి అప్పగించారు. తెలంగాణ రాష్ట్రం రాజాన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం వేములవాడ గ్రామానికి చెందిన చిట్టి శివకుమారి ఏలూరులో ఆదివారం ఉదయం శారీ ఫంక్షన్‌కు హాజరయ్యే నిమిత్తం కొత్తపేటలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చారు. అక్కడ నుంచి ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో చలసాని గార్డెన్స్ కల్యాణ మండపానికి వెళ్ళే నిమిత్తం ఉదయం 10 గంటలకు ఒక ఆటో ఎక్కారు. ఆమెతో పాటు 80 గ్రాముల బంగారు ఆభరణాలు, వస్త్రాలు ఉన్న బ్యాగ్‌ను తీసుకుని బయలుదేరారు. కల్యాణ మండపం వద్ద బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోయారు. ఈ సంఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయగా సీఐ కె.శ్రీనివాసరావు ఆదేశాలతో ఎస్‌ఐ ప్రసాద్ వెంటనే ఏలూరు ఆటో యూనియన్ అధ్యక్షుడు లీలా కృష్ణను సంప్రదించారు. మరోవైపు సాంకేతిక పరిజ్ఞానం కూడా వినియోగించి ఆటో డ్రైవర్‌ను గుర్తించారు. ఆటో డ్రైవర్ తన ఆటోలో బాధితురాలి బ్యాగ్ ఉన్న విషయం కూడా గమనించలేదు. దీంతో పోలీసులు ఆ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలికి ఆదివారం రాత్రి ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ సమక్షంలో సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్‌ఐ గారపాటి అజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది బ్యాగ్ అందజేశారు. ఆటోను త్వరితగతిన గుర్తించడంలో ఎస్‌ఐ అజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ విజయ్‌రాజ్, రఘులకు రివార్డులు ఇస్తామని డీఎస్పీ అన్నారు.



వస్తువులున్న బ్యాగ్‌ను అప్పగిస్తున్న పోలీసు అధికారులు

మామ మందలించాడని కోడలు ఆత్మహత్య

యాదాద్రి భువనగిరి జిల్లా సురేంద్రపురంలో ఘటన

భువనగిరి రూరల్, ఆగస్టు 18: మనవడిని కొట్టొద్దని మామ మందలించడంతో మనస్తాపానికి గురైన కోడలు ఆత్మహత్య చేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలో ఈ సంఘటన జరిగింది. భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా చింతలపూడి గ్రామానికి చెందిన కె.శ్రీనివాస్‌రాజు కుమార్తె భార్గవి(28)కి ఖమ్మం జిల్లా వేంసూరు మండలం శంభునిగూడేనికి చెందిన సతీష్‌రాజుతో 2020, ఆగస్టు 26న వివాహమైంది. భర్త సతీష్‌రాజు, మామ సత్యనారాయణతో భువనగిరి మండలంలోని సురేంద్రపురిలో నివాసం ఉంటున్నారు. శనివారం సాయంత్రం భార్గవి తన రెండున్నరేళ్ల కుమారుడు శివరామరాజుకు అన్నం తినిపిస్తూ కొట్టింది. అదే సమయంలో మామ సత్యనారాయణ కోడలిని మందలించడంతో మనస్తాపానికి గురైన ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. విషయం తెలుసుకున్న భర్త సతీష్‌రాజు కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని డాక్టర్ తెలిపారు. భార్గవి తండ్రి శ్రీనివాస్‌రాజు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

అందని సాగునీరు

తూడుతో అన్నవరం బ్రాంచ్ పంటకాల్వ



ముదినేపల్లి, ఆగస్టు 18: మండలంలోని పలు గ్రామాల ఆయకట్టుకు సాగునీరందించే అన్నవరం బ్రాంచ్ పంటకాలువ పూర్తిగా తూడుతో నిండిపోయింది. దీంతో పీఎస్‌ఎస్ ఛానల్ నుంచి నీరు విడుదల చేసినప్పటికీ ఈ పంట కాలువలో నీటి ప్రవాహానికి తూటు కాడ ఆటంకంగా మారింది. దీంతో ఈ కాలువ కింద సాగులో ఉన్న వడాలి, అప్పారావుపేట, ముదినేపల్లి, అన్నవరం గ్రామాల పరిధిలోని వందలాది ఎకరాల్లో సార్వా వరి పైరుకు సకాలంలో నీరందటం లేదు. దీంతో వరి నాట్లు వేసేందుకు కూడా అవకాశం లేకుండాపోయింది. ఈ పంట కాలువను ఉపాధి పథకం కింద నామమాత్రంగా మరమ్మతులు చేయటం తప్ప ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో పూడిక, తూటుకాడ తొలగింపు కానీ సార్వా సీజన్‌కు ముందు జరగటం లేదు. దీంతో ఇరిగేషన్ అధికారులు అన్నవరం పంట కాలువలో పేరుకుపోయిన తూటుకాడను తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మాచేనమ్మకు భక్తుల తాకిడి

ఆచంట, ఆగస్టు 18: ప్రశిద్ధి చెందిన పెదమల్లం మాచేనమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అనేక మంది భక్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అధికారి రాము, సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సీఎం సహాయనిధి పత్రాలు అందజేత


సీఎం సహాయ నిధి పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, ఆగస్టు 18: ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆర్థిక పరిస్థితి బాగుండక వైద్యం చేయించుకోలేని వేల్పూరు గ్రామానికి చెందిన బోడపాటి నాగ సునీతకు రూ. లక్షా 47 వేల 725, అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామానికి చెందిన అల్లం దేవి నాగ రేవతికి రూ. లక్ష విలువగల సీఎం సహాయ నిధి సిఫార్సు పత్రాలు అందజేయగా వారు ఆరిమిల్లికి కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హుస్సేన్

తణుకు, ఆగస్టు 18: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా వైద్య సేవలు ఆదివారం నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, తణుకులోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఐదుగురికి ఉచిత వైద్య సేవలందించారు. సంఘ సభ్యుడు షేక్ మస్తాన్ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యుడు గిరిజాల నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలగనివ్వద్దు


పట్టణంలో ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 18: ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పట్టణంలోని దుకాణదారులు, తోపుడు బండ్ల వ్యాపారులు సహకరించాలని ట్రాఫిక్ ఎస్సై కొండలరావు కోరారు. తాడేపల్లిగూడెంలో ఆదివారం ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు.

రామరాజుకు బాబ్జి పరామర్శ

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 18: నరసాపురం టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు తండ్రి ఇటీవల మృతి చెందడంతో తాడేపల్లిగూడెం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఆదివారం రామరాజును పరామర్శించారు. వాడపల్లి సుబ్బరాజు, ముప్పిడి రమేష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 18: తాడేపల్లిగూడెం జనతా హాస్పటల్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. నిడదవోలు రాజరాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి సిబ్బంది 74 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. వారిలో 9 మందికి ఆపరేషన్ నిమిత్తం సిఫార్సు చేయగా 20 మందికి కళ్లజోళ్లు అందించారు. అధ్యక్షులు వీపీఎస్ లక్ష్మీనారాయణ, పత్సా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కాళ్ళ, ఆగస్టు 18 : సుమారు 23 ఏళ్ళ క్రితం 7వ తరగతి చదువుకున్న విద్యార్థుల కలయికకు కలవపూడి హైస్కూల్ వేదికైంది. 2001-02 సంవత్సరంలో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట కలిశారు. స్నేహబంధం ఎంత మధురమో అంటూ.. విద్యార్థులు అంతా ఓ చోట కలిసి పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. 23 ఏళ్ల తరువాత కలుసు కున్న వారంతా ఒక చోట చేరి ఆత్మీయ పలకరింపులతో యోగ క్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. వారి పిల్లలు కుటుంబ సభ్యులతో పూర్వ విద్యార్థులు హాజరవడంతో పాఠశాల ప్రాంగణం అంతా పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులతో నిండిపోయింది. వివిధ వృత్తులు ఉద్యోగ వ్యాపారాలలో స్థిరపడి వివిధ ప్రాంతాలలో ఉన్నవారంతా ప్రస్తుత బిజీ షెడ్యూల్లో కూడా స్నేహబంధమే ముఖ్యమంటూ ఓ చోట కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణం అమలు చేయాలి

అత్తిలి, ఆగస్టు 18 : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణను తక్షణం అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అబ్బదాసరి లాజర్ కోరారు. అత్తిలిలో జరిగిన సమితి మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం చొరవ తీసుకుని అన్ని రాష్ట్రాల్లో వర్గీకరణ అమలయ్యేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సమితి తణుకుశాఖ అధ్యక్షుడు అబ్బదాసరి కల్యాణ్, అత్తిలి మండల నాయకులు శీలి బాబూరావు, కొమ్మర రామారావు, ఉండ్రాజవరపు దాసు, నామవారపు అశోక్, నేకూరి రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సాయం



మొగల్తూరు, ఆగస్టు 18: మొగల్తూరులోని పెన్మత్స రంగ రాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదాన అభివృద్ధి పనులకు పూర్వ విద్యార్థులు చేస్తున్న సహకారం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర్ధమాన రవిశంకర్ సర్కార్ అన్నారు. ఆదివారం పాఠశాల 1982-83 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.69వేల నగదును ప్రధానోపాధ్యాయుడుకు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అనంతపల్లి బదిరీనాథ్, పులపర్తి జేఎస్ శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జేశ్వరరావు, వెలిగట్ల త్రినాథ్, కడలి తాతయ్య, అందే సత్యనారాయణ, బొడ్డు రంగనాయకమ్మ, పొన్నపల్లి శ్రీను, కాంచనమాల తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ హత్యకు పీఎంపీల నిరసన



గణపవరం, ఆగస్టు 18: కోల్ కతాలో జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా రెండో రోజు గణపవరంలో పీఎంపీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి ఆదివారం గణపవరం పుర వీధుల్లో నినాదాలు చేస్తూ తక్షణం డాక్టర్ హత్యకు పాల్పడిన హంతకులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యుల పై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ నిరసన తెలిపిన వారిలో ప్రముఖ కంటి వైద్యులు యూజీ.రాజు, కె.హరినాథ్, పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, మండల అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ మూర్తి, ఉపాధ్యక్షుడు సీహెచ్‌వీ ప్రభాకరరావు, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్ పాలనంతా విధ్వంసమే: మంత్రి నిమ్మల


వరద బాధితులకు బియ్యం, నిత్యావసరాలు అందిస్తున్న మంత్రి నిమ్మల

యలమంచిలి, ఆగస్టు 18: కాంబోట్లపాలెంలో రూ.14.60లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారుల పనులకు మంత్రి రామానాయుడు శంకుస్థాపన చేశారు. అనంతరం కాంబోట్లపాలెం గ్రామంలో 205 వరదప్రభావిత కుటుంబాలకు, గుంపర్రు గ్రామంలో 170కుటుంబాలకు 25కేజీలు చొప్పున బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ జగన్ ఐదేళ్లపాలనలో 14లక్షలకోట్లు అప్పుతెచ్చి, పక్కదారి మళ్లించి, ఖజానా ఖాళీచేసి, ప్రతివ్యక్తి మీద రూ.2.50లక్షల అప్పు పెట్టారని అన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో నాడు జగన్ పాలన ప్రారంభమైతే, నేడు మన ప్రజాప్రభుత్వంలో పెన్షన్ల సొమ్ము పెంపుతో సంక్షేమ పాలన మొదలైందన్నారు. జగన్ పాలన అంతా విధ్వంసమేనని అన్నారు. తనకు హ్యాట్రిక్ విజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. సర్పంచ్‌లు అనిశెట్టి మల్లిక, తుంగా అమూల్య, ఎన్డీఏ నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, చిట్టూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

తలుపుల్లేవు.. నీటి వసతి లేదు

అధ్వానంగా మరుగుదొడ్లు..

తణుకు బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల పాట్లు


బాలికల మరుగుదొడ్లకు అడ్డుపెట్టిన దృశ్యం

తణుకు, ఆగస్టు 18: తణుకు బాలుర ఉన్నత పాఠశాలలో పలు మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేదు. నాడు-నేడు పథకంలో విరివిగా నిర్మించినప్పటికి వాటి నిర్వహణ మాత్రం పూర్తిగా మర్చారు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుతున్నారు. స్కూలు వెనుక వైపు ఉన్న మరుగుదొడ్లకు కనీసం తలుపులు కూడా లేవు. మొదటి అంతస్తులో ఉన్న బాలికల మరుగుదొడ్లకు వెళ్ళే వీలు లేకుండా పెద్ద చెక్క అడ్డుపెట్టారు. మరుగుదొడ్లు ఉన్నప్పటికీ అక్కడ నీరు అందుబాటులో ఉండటం లేదని, నిర్వహణ లేదని పలువురు విద్యార్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు మరుగుదొడ్లు సక్రమంగా నిర్వహించేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఘనంగా ఆర్థిక మంత్రి నిర్మలమ్మ జన్మదిన వేడుక

నరసాపురం రూరల్, ఆగస్టు 18: మండలంలోని పీఎంలంక దత్తత గ్రామంలో ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ జన్మదిన వేడుకను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాల్లో నిర్మలమ్మ ఆరోగ్యంగా ఉండాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెంటర్‌లో భారీ కేక్ కట్ చేశారు. గ్రామాభివృద్ధికి నిర్మలా సీతారామన్ చేసిన కృషి కొనియాడారు. సముద్ర కోత నివారణకు కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



నరసాపురం రూరల్, ఆగస్టు 18: మండలంలోని పసలదీవి గ్రామానికి చెందిన కొట్టు పెద్దపద్దరాజు(105) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. 1916లో జన్మించిన ఆయన ఐదేళ్ళ క్రితం వరకు ఆరోగ్యంగా ఉన్నాడు. ఆయన పని ఆయనే చేసుకునేవాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆరుగురు మనవరాళ్లు, ఇద్దరు మనవళ్లు, ముగ్గురు ముని మనవరాళ్లు ఉన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయిస్తాం


విలేకర్లతో మాట్లాడుతున్న బీజేపీ కన్వీనర్ సతీశ్

నరసాపురం, ఆగస్టు 18: నరసాపురం తీరంలో కేంద్ర ఆర్థిక నిధులతో చేపట్టే పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని బీజేపీ కన్వీనర్ మేకల సతీశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి రవి తెలిపారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ కోటిపల్లి- నరసాపురం రైల్వేలైన్ పనుల్ని ఇప్పటికే కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిధుల కొరత కారణంగా గత రెండేళ్ల నుంచి ఈ పనులు ముందుకు సాగలేదన్నారు. ఇటీవల బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగడం వల్ల పనులకు మళ్లీ ఊపువచ్చిందన్నారు. 2025 చివరి నాటికి ఈ పనుల్ని పూర్తి చేయించాలని కేంద్ర మంత్రిని కోరామన్నారు. అలాగే నరసాపురం వశిష్టా వారధి టెండర్లు ముందుకు సాగడం లేదన్న విషయాన్ని కూడా మంత్రికి చెప్పామన్నారు. ఆక్వాయూనివర్సిటీ పనుల్ని కూడా వేగవంతం చేయించాలని కేంద్ర మంత్రిని కోరామన్నారు. సమావేశంలో పీవీఆర్, పండు, మునికోటి వెంకటేశ్వరావు, గునిశెట్టి శ్రీను, దిలీప్ పాల్గొన్నారు.

నటుడు శ్రీరమణ భార్గవ్‌కు అభినందనలు



పాలకొల్లు అర్బన్, ఆగస్టు 18 : కమిటీ కుర్రాళ్ళు సినిమాలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించిన పోడూరు మండలం గుమ్ములూరుకు చెందిన శ్రీరమణ భార్గవ్‌ను స్థానిక గీతా అన్నపూర్ణ థియేటర్‌లో ఆదివారం పట్టణ చిరు ఫ్యాన్స్ అభిమానులు అభినందించారు. నటుడు నాగేంద్ర బాబు కుమార్తె నిహారిక నిర్మించిన కమిటీ కుర్రాళ్ళు సినిమా స్థానిక గీతా అన్నపూర్ణా థియేటర్‌లో ప్రదర్శింప బడుతోంది. ఈసందర్భంగా శ్రీరమణ భార్గవ థియేటర్‌కు రావడంతో బొకేలను ఇచ్చి శాలువాలు కప్పి అభినందించారు. రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు శిడగం సురేంద్ర, బి.లక్ష్మీనారాయణ, కె.సురేంద్ర, ఆచంట సురేష్, ముత్యాల గిరీష్, సంతోష్, అప్పన్న తదతరులు పాల్గొన్నారు.

అర్చకులకు వేతనాల పెంపుపై హర్షం

పాలకొల్లు అర్బన్, ఆగస్టు, 18: రాష్ట్రంలోని చిన్న దేవాలయాల్లో దైవ సేవలు చేస్తున్న నిరుపేద బ్రాహ్మణులకు, దీప దూప నైవేద్య పథకం ద్వారా ఇచ్చే వేతనాన్ని రూ.5వేల నుంచి 10వేలకు పెంచుతూ దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి ప్రకటించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. బ్రాహ్మణ సాధికార సమితి నియోజకవర్గ కన్వీనర్ పెండ్యాల భవానీ మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాల మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలలు కాకుండానే ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తోందని అన్నారు. హర్షం ప్రకటించిన వారిలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఎం.సునీత, శ్రీగాయత్రి పురోహిత సంఘం నాయకులు మద్దూరి సూరిబాబు, తనికెళ్ళ శ్రీనివాస్, ఫణి, ఎం.రవీంద్ర, కాశీ, శివకోటి కుమార్, శ్రీ క్షీరా రామలింగేశ్వర సేవ సమితి అధ్యక్షుడు శీరం ఆనంద కృష్ణ ఉన్నారు.

భీమవరం నుంచి భద్రాచలానికి సర్వీసు

భీమవరం టౌన్, ఆగస్టు 18 : భీమవరం డిపో నుంచి భద్రాచలానికి అల్ట్రా డీలక్స్ సర్వీసు నడుపుతున్నామని డిపో మేనేజర్ పీఎస్‌వీ ఎం.సత్యనారాయణ మూర్తి తెలిపారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో చాలా మంది ప్రయాణికులు భద్రాచలంకు సర్వీసు ఏర్పాటు చెయ్యాలని కోరిన నేపథ్యంలో ఈసర్వీసును ఏర్పాటు చేశామన్నారు. ఈ సర్వీసు భీమవరం నుంచి ఉదయం 4-30 గంటలకు బయలుదేరి కైకలూరు, ఏలూరు, చింతలపూడి, సత్తుపల్లి, కొత్తగూడెం, పాల్వంచ, మీదుగా భద్రాచలం చేరుకుంటుందన్నారు. తిరిగి 1 గంటకు భద్రాచలంలో బయలుదేరి రాత్రి 7-30 గంటలకు భీమవరం చేరుకుంటుందన్నారు. ఈసర్వీసుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని, వివరాల కోసం 96660 89036, పాత బస్‌స్టాండ్ నెంబరు 98665 81333 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అబ్బాయిరాజు పార్కులో సందడి



ఉండి ఆగస్టు 18: ఉండిలో కలిదిండి అబ్బాయిరాజు పార్కులో సందడి నెలకొంది. ఆదివారం కావడం తో విద్యార్థులు, చిన్నారులు, కుటుంబసభ్యులతో విచ్చేశారు. ఆగస్టు 15న కలిదిండి పార్కును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఊయల, ఫౌంటైన్, వాకింగ్‌ట్రాక్, షెటిల్, వృద్ధుల విశ్రాంతి భవనం, క్యాంటీన్‌లను ఏర్పాటు చేశారు.

వేద పారాయణం



ఉండి ఆగస్టు 18: శ్రావణమాసం పురస్కరించుకుని 100మంది వేదపిండితులచే రాజులపేటలో వున్న శివాలయంలో వేద పారాయణం నిర్వహించారు. ఆలయ అర్చకులు సన్నిధిరాజు చలపతిరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు.

పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు


పాలకోడేరులో పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న గౌడ సంఘ నాయకులు

పాలకోడేరు, ఆగస్టు 18: పాలకోడేరులో పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాలకోడేరు గ్రామంలోని పురాన దిమ్మ వద్ద ఉన్న గౌడసెంటర్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి గౌడ సంఘ నాయకులు కారింకి సాయిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ బీసీ సంఘ నాయకులు కొండేటి శివకుమార్ గౌడ్ పాల్గొని పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు.

స్మృతి వనానికి దాతలు ముందుకు రండి

భీమవరం టౌన్, ఆగస్టు 18 : పట్టణంలో తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన క్విట్ ఇండియా స్థూపం చారిత్రాత్మక వేదికగా నిలిచిందని, ఎంతోమంది దాతల సహకారంతో 1992లోను తిరిగి 2022లోను పునః నిర్మాణం చేశామని, మిగిలిని కొంత పనులకు దాతలు ముందుకు రావాలని క్విట్ ఇండియా స్థూప పునః నిర్మాణ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రహ్మణ్యం కోరారు. ఈ స్మృతి వనానికి ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ నాగరాణి అనుమతి ఇవ్వడంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

బోసు మరణం ఇప్పటికీ రహస్యమే


బోసు చిత్ర పటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, ఆగస్టు 18: స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్ర బోస్ మరణం ఇప్పటికీ ఒక రహస్యంగా మిగిలిపోయిందని అఖిల భారత శోభన్‌బాబు కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో క్విట్ ఇండియా స్థూపం వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ సంస్మరణ సభ నిర్వహి ంచారు. అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గాంధీ అహింసా వాదం మాత్రమే స్వాతంత్ర్య సాధనకు సరిపోదని, పోరుబాట కూడా ముఖ్యమని బోసు భావన అని అన్నారు. బోసు మరణం వివాదాస్పదమైందని, 1945 ఆగస్టు 18న తైవాన్లో జరిగిన విమాన ప్రమాదంలో బోసు మరణించాడని ప్రకటించినప్పటికి, అతను ప్రమాదం నుంచి బయట పడి అజ్ఞాతంలోకి వెళ్ళాడని పలువురు నమ్ముతారని అన్నారు.

ఆదర్శ గ్రామంగా ప్రాతాళ్ళమెరక


ప్రాతాళ్ళమెరకలో పర్యటిస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

కాళ్ళ, ఆగస్టు 18 : గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పనలో ప్రాతాళ్ళమెరక గ్రామం ఆదర్శంగా ఉందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ప్రాతాళ్ళమెరక గ్రామాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రత, మంచినీటి చెరువు, ఆరోగ్య కేంద్రం, సచివాలయం, సమీపంలో శివాలయం సందర్శించి ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడారు. మంచినీటి చెరువు వద్ద గ్రామస్తులు ఒక చోట చేరి మాట్లాడుకునే షెడ్ వద్ద గ్రామస్తులను కలిసి కొద్ది సేపు ముచ్చటించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులపై తాను ముంబాయి విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో పరిస్థితులను పరిశీలించి ప్రజల అభిప్రాయాలతో నివేదిక తయారు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రాతాళ్ళమెరక గ్రామంలో మౌలిక వసతులు కల్పనలో గ్రామస్తుల సహకారం దాతృత్వం తోడ్పాటైతే గ్రామాభివృద్ధిలో ఎన్నో అద్భుతాలు సాధించవచ్చని, ఈవిధంగా దాత శివవర్మ నిరూపించారని ఆయన్ని అభినందించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంతేటి ఉషా, టీడీపీ గ్రామాధ్యక్షుడు కంతేటి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యే చిట్టిరాజుకు సత్కారం

భీమవరం అర్బన్, ఆగస్టు 18: బేతని చర్చ్‌లో ఆదివారం ఐపీఎస్‌కు ఎంపికైన కొయ్యే చిట్టిరాజును సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్రైస్తవ నాయకుడు డా. పట్టా దేవరాజ్, సంఘ సభ్యులు జాన్ ప్రకాష్, పి.సుదర్శన్ కుమార్, పీడీ విల్సన్, గంటా సుందర్ కుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ బాలచందర్‌కు ప్రశంసా పత్రం

పెనుగొండ, ఆగస్టు 18: స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఒడిస్సాలోని పర్లాకిమిడి వారి ఉత్కళ సాహితి వేదిక ఆధ్వర్యంలో అంతర్జాలం ద్వారా నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో స్థానిక ఎస్‌వీకేపీ అండ్ పీవీ జూనియర్ కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ బాల చందర్ సాదే పాల్గొన్నారు. మువ్వన్నెల జెండా గేయాన్ని మధురంగా ఆలపించి సభికులను ఆనంద పరవశుల్ని చేశారు. ఈ సందర్భంగా బాల చందర్‌ను అభినందిస్తూ ప్రశంసాపత్రం అందించారు.

బండి ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

మొగల్తూరు, ఆగస్టు 18: తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన ప్రాంతంతో పాటు సరిహద్దు జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాస మూడవ ఆదివారం కావడంతో మహిళలు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఈవో డి.రామకృష్ణంరాజు భక్తులకు సదుపాయాలు కల్పించారు.

ఘనంగా కోదండ రామాలయ వార్షికోత్సవం

మొగల్తూరు, ఆగస్టు 18: మొగల్తూరు కోట వద్ద కోదండ రామాలయం 6వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని తులసిమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనలో సుమారు వెయ్యి మంది భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు బొల్లా చంటి, జంప శివరావు, మాదిరెడ్డి బాలాజీ, జంపా వాసు, సూదాబత్తుల సూరిబాబు, రావుల నాని, యల్లమిల్లి వెంకటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముచ్చువారితోటలో మావుళ్ళమ్మ జాతర


జాతరను ప్రారంభించిన ఎమ్మెల్యే రామాంజనేయులు

భీమవరం అర్బన్, ఆగస్టు 18 : ముచ్చువారితోటలో మద్దుల రాము, మిత్రబృందం ఆధ్వర్యంలో మావుళ్ళ జాతర మహోత్సవాలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, పార్టీ నాయకులు ఇందుకూరి రామలింగరాజు, గంటా త్రిమూర్తులు, జనసేన పట్టణ అధ్యక్షులు చేన్నమల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చిరు అభిమానులు మరిన్ని సేవలు చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

మొగల్తూరు, ఆగస్టు 18: పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి అభిమానులు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కోరారు. చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం పేరుపాలెం సౌత్ గ్రామంలో నరసాపురం అశ్విని ఆసుపత్రి వైద్యులు, జనసేన డాక్టర్స్ సెల్ సభ్యుడు మాదంశెట్టి కోటేశ్వరరావు ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మాజీ సర్పంచ్ మేళం బన్ను వైద్య శిబిరం ఏర్పాట్లు చేయగా సర్పంచ్ తిరుమాని విజయలక్ష్మీ నర్సింహమూర్తి, జిల్లా అధ్యక్షుడు కోపెల్ల శ్రీనివాస్, కోటిపల్లి వెంకటేశ్వరరావు, కొల్లాటి గోపి, నరసాపురం పార్కా అధ్యక్షుడు సీహెచ్ నాగబాబు, అడ్డాల బాబి పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



భీమవరం టౌన్, ఆగస్టు 18 : మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా మూడవరోజు 12వ వార్డు ఇందిరమ్మ కాలనీలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొల్లవాని తిప్ప జనసేన పార్టీ నాయకులు పోకల కిషోర్, మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము, సుంకర చందు, అల్లు శ్రీనివాస్, యడ్లపల్లి రాంబాబు, కొప్పర్తి కోటి తోట శేషు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌మూర్తి మాస్టారుకు నివాళులు



భీమవరం అర్బన్, ఆగస్టు 18: కమ్యూనిస్టు ఆశయాల కోసం జీవితాంతం వలవల శ్రీరామ్ మూర్తి పోరాడారని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద సీపీఎం నాయకులు వలవల శ్రీరామ్ మూర్తి నివాళి సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మూర్తి మాస్టారు లేని లేటు కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జేఎన్‌వీ గోపాలన్, ఆంజనేయులు, వైకుంఠరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ

భీమవరం అర్బన్, ఆగస్టు 18: భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని భీమవరంలో ఈ నెల 20వ తేదీన పునఃప్రారంభించనున్నట్లు కాంగ్రెసు పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అంకెం సీతారామ్ తెలిపారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు పాల్గొన్ని ఆవిష్కరిస్తారన్నారు.

వక్ఫ్ బిల్లు ఉపసంహరించుకోవాలి

ఆకివీడు, ఆగస్టు 18 : వక్ఫ్ బిల్లు భారతదేశ మౌలిక స్వభావంగా ఉన్న భిన్నత్వంలో ఏకత్వాన్ని దెబ్బతీసే విధంగా ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జేఎన్వీ గోపాలన్ అన్నారు. ఆదివారం షాదీఖానాలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. వక్ఫ్ బిల్లు సవరణ ముస్లింల పట్ల దురుద్దేశంతో చేసిన సవరణ తప్ప ప్రేమతో కాదన్నారు. వక్ఫ్ బోర్డుకు ఉన్న అధికారాలను తొలగించి జిల్లా కలెక్టర్‌కు ఇవ్వడం వెనుక పెద్దకుట్ర ఉందన్నారు. వక్ఫ్ బిల్లును తక్షణమే బీజేపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు.

కంటి వ్యాధులపై అవగాహన

గణపవరం, ఆగస్టు 18: సేవా భావంతో వైద్య సేవలందిస్తున్న మీనాక్షి కంటి ఆస్పత్రిని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ నేత్ర శస్త్ర చికిత్స వైద్యనిపుణుడు యూజీ.రాజు కోరారు. గణపవరం, నిడమర్రు మండలాల పీఎంపీ వైద్యులకు గణపవరం లోని మీనాక్షి కంటి ఆస్పత్రి భవనంలో ఆదివారం కంటి వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. గణపవరంలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు శస్త్రచికిత్స విభాగాన్ని డాక్టర్ యూజే.రాజు ప్రారంభించారు. మీనాక్షి కంటి ఆస్పత్రి వైద్యుల కె.హరినాధ్‌రెడ్డి, పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, గణపవరం మండల పీఎంపీల అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు సీహెచ్‌వీ ప్రభాకరరావు, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్బరాజు, మానవత రీజియన్ కన్వీనర్ కాకర్ల వినాయక్ పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

పెదపాడు, ఆగస్టు 18: వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలని ఎస్సై కె.శుభశేఖర్ సూచించారు. కలపర్రు టోల్‌గేట్ వద్ద సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు ఈ చలానా రూపంలో జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపడం ద్వారా క్షేమంగా గమ్యం చేరుకోవచ్చునాన్నరు. అతివేగంగా, మద్యం సేవించి వాహనాలను నడపటం వల్ల కొన్నిసార్లు ప్రాణాపాయం కూడా కలుగవచ్చునన్నారు.